# శ్రీమతి– ఉద్యోగిని

ఆదివారంపూట పనులన్నీ పూర్తయేసరికి పదకొండయింది. గదలో కూర్చుంటే చలివేస్తూందని వరండాలో ఎండ పడుతున్నవైపు పడకకుర్చీ వేసుకుని పేపరు చదువుకుందామని కాస్త నడుం వాల్చానో లేదో బెల్లు కొట్టారు ఎవరో వాకిట్లో. ఏ పేపరువాడో బిల్లు తీసుకొచ్చి ఉంటాడు, లేకపోతే కోకోకోలా కొట్టువాడు సీసాలు వాపసు తీసుకుపోవటానికి వచ్చి ఉంటాడు అనుకుంటూ బద్ధకంగా లేచి వెళ్ళాను తలుపు తియ్యటానికి.

ఎదురుగా ఏదో కొత్త ముఖం కనిపించింది. దరిదాపు పాతికేళ్ళుంటాయి. చదువుకున్న అమ్మాయిలా ఉంది. ఒక చేతిలో ఫైలూ, మరో చేతిలో లెదర్ బాగ్ ఉన్నాయి. ఏదన్నా అడ్వర్‌టైజ్‌మెంటు బాపతేమో, 'బోర్' చేస్తుందిరా భగవంతుడా అనుకుని తలుపురెక్క ఒకచేత్తో పట్టుకుని పూర్తిగా తలుపు తెరవకుండానే 'ఎవరు కావాలి?' అని అడిగాను.

ఆ పిల్ల చిరునవ్వు నవ్వుతూ 'మీరే కావాలి' అంది. పిల్ల బాగానే ఉంది చూడటానికి ముచ్చటగా.

ఫలానా రావుగారు మీకు తెలుసుకదా అంది.

'అవును, తెలుసు' అన్నాను అనుమానంగా చూస్తూ.

'రావుగారి భార్య మీ గురించి చెప్పారు. చిన్న పనుందినాకు. కాస్సేపు నాతో మాట్లాడటానికి వీలవుతుందా మీకు?' అని అడిగింది.

'లోపలికి రండి' అంటూ తలుపు తెరిచాను. ఎండ పడుతున్న వైపు మరో కుర్చీవేసి ఆ అమ్మాయిని కూర్చోమన్నాను. వీథి తలుపులు వేసి వచ్చి నేనూ కూర్చున్నాను.

'ఎవరమ్మాయి మీరు?' అని అడిగాను, చెప్పింది. 'ఏం చేస్తున్నా రిప్పుడు?' అని మళ్ళీ అడిగాను.

'నేను యూనివర్సిటీలో రిసెర్చి చేస్తున్నాను. నా పేరు సుజాత.'

మాట్లాడుతూంటే ఆ అమ్మాయి కళ్ళు మెరుస్తాయి నక్షత్రాల్లాగ. కళ్ళు మరీ పెద్దవి కాకపోయినా, ఆ మెరుపు అందాన్ని తెచ్చి పెడుతూంది. పెళ్ళికాని పిల్లలాగే వుంది.

'ఏ డిపార్టుమెంటులో రిసెర్చి చేస్తున్నారు?'

'సోషియాలజీ'.

'సబ్జెక్టు ఏమిటి?'

'నా సబ్జెక్టు మీరే' అంది నవ్వుతూ.

'అదేమిటి!' అన్నాను తెల్లబోతూ.

'నేను వచ్చిన పని చెబితే నా సబ్జెక్టు మీకు అర్థమవుతుంది.'

నేను మారుప్రశ్న వెయ్యకుండా ఇంకా ఏం చెబుతుందోనని చూశాను.

'మీరు ఉద్యోగం చేస్తున్నారు కదా' అంది.

అవునన్నట్లుగా తల ఊపాను.

'మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుతాను· జవాబులు చెప్పటాని కేమన్నా అభ్యంతరమా?' అని అడిగింది.

'ఇంతకీ....'అంటూ నసిగాను.

'మీ అమూల్యసమయాన్ని వృథా చేస్తున్నందుకు క్షమించాలి. కాని, నా పరిశోధనకి మీవంటివారి సహకారం చాలా అవసరం' అంది అతి వినయంగా.

'అంటే...'

నా అనుమానాలను నా కళ్ళలో చదివిందేమో ఆ అమ్మాయి, వెంటనే తన ఫైలు తెరిచి ఒక కాగితం తీసి నా చేతికిచ్చింది· అది చూసిన తరవాత నేను కాస్త స్నేహపూర్వకంగా చూశాను సుజాతవైపు.

'ఉద్యోగాలు చేస్తున్న మీవంటి గృహిణుల అభిప్రాయాలను సేక రించటం నా పరిశోధనలో ఒక ముఖ్యభాగం. ఉద్యోగినులైన శ్రీమతుల మీద నేను పరిశోధన చేస్తున్నాను. ముఖ్యంగా మనదేశంలో గృహిణులు ఉద్యోగాలు చెయ్యటం అంతగా వ్యాపించలేదు. స్త్రీలు గృహిణులుగానూ, ఉద్యోగినులుగానూ ద్వంద్వబాధ్యతని ఎలా నిర్వహిస్తున్నారు, ఏయే సమస్యలని ఎదుర్కొంటున్నారు, ఎలా పరిష్కరించుకుంటున్నా రన్నదే నా పరిశోధనాంశం' అంటూ సుజాత వివరించింది.

'మీరు ఎంచుకున్న సమస్య చాలా బాగుంది. ఎంతో సామాన్య మయిన విషయంలా కనిపిస్తున్నా, మీరు అటువంటి విషయం మీద పరి శోధన చేస్తున్నారంటే నాకు చాలా ఆనందంగా ఉంది' అన్నాను ఆ అమ్మాయికి ఉత్సాహం కలిగించాలనే ఉద్దేశంతో.

'నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. మీరు నిస్సంకోచంగా జవాబు చెప్పాలి. మీరు చెప్పిన సంగతులన్నీ ఫలానా వారు చెప్పినట్లుగా ఎవరికీ తెలియనివ్వను. కేవలం ఒక శ్రీమతి—ఉద్యోగిని అభిప్రాయాలు, అను భవాలుగా మాత్రమే వాడుకుంటాను. అందుచేత మీరు మొహమాట పడ కుండా మీ మనసులోది ఉన్నది ఉన్నట్లు చెప్పండి' అంది సుజాత.

నేను గొంతు సవరించుకున్నాను 'రెడీ' అన్నట్లు. ఇంతలో లోపల నుంచి 'ఏమే!' అని ఆయన పిలుపు వినిపించింది. 'ఇప్పుడే వస్తాను ఉండండి' అన్నాను సుజాతతో.

నేను లోపలికి వెళ్లగానే—'ఎవరితో మాట్లాడుతున్నావు ఇంత సేపూ' అన్నారు మంచం మీద పడుకుని. చెప్పాను సంగతంతా.

'ఎవరో, ఏమిటో? ఎందుకొచ్చిన గొడవ? ఏదో సాకు చెప్పి పంపించెయ్యకపోయావా' అన్నారు విసుక్కుంటూ.

'ఆ అమ్మాయి చాలా మర్యాదస్తురాలిలాగే ఉందండీ. పైగా రాఘవ రావుగారి భార్య పంపించింది. కాదని ఎలా అనను, పోనీ, మీరొచ్చి కలుసుకోకూడదూ! మీకే తెలుస్తుంది' అన్నాను.

'ఛ ఛ! ఎవరో, ఏమిటో! మన సంసారం గుట్టు అంతా లాగి... రేపొద్దున్న ఏదన్నా జరిగిందంటే...?

'అబ్బబ్బ! ఏమిటండీ మీ అనుమానాలూ మీరూనూ! వచ్చి చూడ రాదూ ఆ పిల్లని? పైగా, వాళ్ల ప్రొఫెసరు రాసిన ఉత్తరం చూపించింది కూడాను. నేనూ చదువుకున్నదాన్ని, ఉద్యోగం చేస్తున్నదాన్ని, నాకా మాత్రం విచక్షణజ్ఞానం లేదంటారేమిటి?'

'ఊఁ, సర్లే, తొందరగా పంపించేటు చూడు. నాకు నిద్ర రావటం లేదు' అన్నారు మంచంమీద ముడుచుకుని పడుకుంటూ. నేను నవ్వు కుంటూ పడకగది తలుపు దగ్గరగా వేసి, ఫ్రిజ్‌లో ఉన్న 'ఫాంటాలు' రెండు పట్టుకెళ్ళి సుజాతకి ఒకటి ఇచ్చి, నేనొకటి తీసుకున్నాను.

అప్పటికే సుజాత కాగితాలూ, పెన్నూ సిద్ధంగా పెట్టుకుంది. 'ఫాంటా' సిప్‌చేస్తూ, 'ఎన్నాళ్ళయింది మీ పెళ్లయి?' అంది.

'నాలుగు పంచవర్ష ప్రణాళికలు పూర్తిచేశాం' అన్నాను.

'ఇరవై సంవత్సరాలే!' అంటూ ఆశ్చర్యపోయింది. ఒళ్ళో పెట్టు కున్న కాగితంమీద ఏదో వ్రాసుకుంటూ, 'పెళ్ళినాటికి ఎన్నేళ్లు మీకు?' అని అడిగింది.

'మీరు చాలా గడుసువారు!' అన్నాను నవ్వుతూ.' నా వయస్సెం తని సూటిగా అడక్కుండానే ఎంతో తెలుసుకోవాలనా!'

'అబ్బే, అదికాదండీ' అని ముసిముసిగా నవ్వింది సుజాత.

'పెళ్ళినాటికి నాకు ఇరవై.'

'అప్పటికి మీవారి వయస్సెంత?'

'ముప్ఫయి'

'మీది తల్లిదండ్రులు చూసిన సంబంధమా లేక ప్రేమ వివాహమా?'

'ఏదీకాదు, మధ్యరకం.'

'అదెలా జరిగిందండీ?' ఆశ్చర్యంగా అడిగింది సుజాత.

'ఆయన్నీ నన్నూ ఎరుగున్న స్నేహితులిద్దరు మా వివాహాన్ని ప్రతిపాదించారు. మేమిద్దరం ఒప్పుకున్నాం. మా తల్లితండ్రులకి కూడా అభ్యంతరం లేకపోయింది. సంప్రదాయసిద్ధంగా వివాహం జరిగింది.'

'మీకు పిల్లలు ఎంతమంది?'

'లేరండీ'.

'అచ్ఛా!' అంది వ్రాసుకుంటున్నది తలఎత్తి చూసి.

'మీ ఇంట్లో ఎవరవరుంటారు?'

'ప్రస్తుతం మేమిద్దరమే.'

'ఎన్నాళ్ళయింది మీరు ఉద్యోగంలో చేరి?'

'పదిహేనేళ్ళయింది.'

'వివాహానికి ముందు ఉద్యోగం చేశారా?'

'లేదు.'

'మధ్యలో ఎప్పుడైనా ఉద్యోగం మానేశారా?'

'లేదు.'

'మీ వారికి మీరు ఉద్యోగం చేయటం ఇష్టమేనా?'

'...'

'ఏం, సందేహిస్తున్నారు? మీరు ఉద్యోగం చెయ్యటం మీవారికిష్టంలేదా?'

'అసలు నన్ను ఉద్యోగంలో చేరమని ప్రోత్సహించినది ఆయనే. కాని...'

'అంటే, ఇదివరకు ఆయనకు ఇష్టంగానే ఉండేది. ఇప్పుడంతగా ఇష్టపడటం లేదన్నమాట. అంతేగా?'

'అప్పుడప్పుడు అలానే అనిపిస్తుంది నాకు.'

'మొదట్లో ఉద్యోగంలో ఎందుకు చేరారు? ఇప్పుడెందుకు చేస్తున్నారు?'

'మొదట్లో ఇంట్లో తోచక చేరాను. ఇప్పుడు అలవాటయిపోయి చేస్తున్నాను.'

సుజాత చిరునవ్వు నవ్వింది జవాబు కాగితంమీద వ్రాసుకుంటూ.

'తోచక పోవటం ఒక్కటే కారణమా, లేక ముఖ్యకారణమా?'

'ముఖ్యకారణం అని చెప్పవచ్చు అంటే ఇతర కారణాలు కూడా ఉండి ఉంటాయన్నమాట' అంది సుజాత లాయరులాగ.

నేను తల పంకించాను ఎటూ చెప్పకుండా.

'మీ వారి సంపాదన చాలక మీరు ఉద్యోగంలో చేరారా?'

'చాలట మనేదానికి అంతెక్కడ లెండి? డబ్బు ఇబ్బందివల్ల మాత్రం కాదు.'

'అయితే, మీవారి సంపాదనకి తోడు మరికొంత సంపాదించి కొన్ని అదనపు అవసరాలనీ, సరదాలనీ తీర్చుకోవటానికి ఉద్యోగంలో చేరారా?'

'ఉద్యోగంలో చేరినప్పుడు అలా అనుకోలేదు. కానీ, నా సంపాదన చాలాసార్లు అదనపు ఖర్చులికి ఉపయోగపడక పోలేదు.'

'ఇంట్లో ఇబ్బందుల నుంచీ, అత్తవారి ఆగడాలనుంచీ తప్పించుకోవటానికి కూడా ఉద్యోగంలో చేరారా?'

'అబ్బెబ్బే! అదృష్టవశాత్తు అటువంటి బాధలేం లేవు'.

'ఇతరులతో స్నేహం చేసుకోవటానికీ, సరదాగా కలిసి మెలిసి నలుగురిలో తిరగటానికీ ఉద్యోగంలో చేరారా?'

'అదీ ఒక కారణమే. కాలేజీ చదువు పూర్తవుతూనే వివాహం అయింది. అయిదు సంవత్సరాలు ఇంట్లో కూర్చునేసరికి విసుగుపుట్టింది. తిరిగే కాలూ, తిట్టే నోరూ ఊరుకోదన్నట్లు, గుళ్లో విగ్రహంలా ఇంటిపట్టున ఉండబుద్ధి కాలేదు'.

'మీరు చదువుకున్న చదువు వినియోగించాలనే ఉద్దేశంతో చేరలేదా?'

'అదీ ఒక కారణమే నేను చేరటానికి'.

'ఉద్యోగస్థురాలిగా పైకి రావాలనే ఉద్దేశంతోనూ, కొంత పరపతిని సంపాదించుకోవాలనే ఉద్దేశంతోనూ ఉద్యోగంలో చేరలేదా?'

'ఏదో కాలక్షేపం కోసం ఉద్యోగంలో చేరానుకాని, ఊళ్లేలాలనే ఉబలాటంతో కాదు. కానీ, కష్టపడి శ్రద్ధగా పనిచెయ్యటం వల్ల కాల

క్రమాన పైకి రావటం తటస్థించింది. ఉద్యోగంలో హోదాతో బాటే పరపతి కూడా పెరిగింది.'

'మీ ఉద్యోగంలో ఎంతగా సంతృప్తి కలుగుతోంది మీకు?'

'సాధారణంగా చాలా తృప్తికరంగానే ఉంటుంది. కానీ, ఒక్కొక్కప్పుడు ఇంకా ఏదో సాధించాలనే తపన, పరిస్థితులు అనుకూలంగా లేనందువల్ల అసంతృప్తి కలుగుతాయి.'

'పరిస్థితులు అంటే ఇంట్లో పరిస్థితులా, ఆఫీసు పరిస్థితులా?'

'రెండూను. ఆఫీసులో పని ఒత్తిడి ఉన్నప్పుడే ఇంట్లో చుట్టాలూ స్నేహితులూ దిగుతారు. మగవారిలా ఆడవాళ్ళు ఆఫీసు పని ఇంట్లో చూసుకోవాలంటే ఎలా కుదురుతుంది? ఇంట్లో తీరిక ఉన్నా కూడా ఆఫీసు విషయాల మీద శ్రద్ధ చూపించటం ఇంట్లో ఎవరూ సహించరు,అవసరం. ఉండి ఆఫీసులో ఎక్కువ సమయం ఉండవలసివచ్చినా, ఇంట్లోవాళ్ళు సహృదయంతో సహకరించటానికి ముందుకి రారు. ఉద్యోగంలో పైకి రావటానికి మగవాళ్ళు ప్రయత్నించినట్లు ఆడవాళ్ళు చెయ్యాలంటే కుదరదు. అందుకే అప్పుడప్పుడు అసంతృప్తి కలుగుతూ ఉంటుంది.'

'మీ వారి ఉద్యోగం మీకు ఎంతగా సంతృప్తి కలిగిస్తోంది?'

'ఎటువంటి అసంతృప్తి లేదు నా మటుకు.'

'మీ అత్తగారూ, మామగారూ ఉన్నారా?'

'ఉన్నారు.'

'మీ మామగారంటే మీ కిష్టమేనా?'

'అదేం ప్రశ్న! ఎందుకలా అడుగుతున్నారు?' సుజాత మృదువుగా నవ్వింది. 'రకరకాల కుటుంబపరిస్థితులు అర్థం చేసుకుంటేగాని, ఉద్యోగం చేస్తున్న స్త్రీ మీద పరిస్థితుల ప్రభావం ఎలా పడుతుందో, ఎటువంటి ప్రభావం పడుతుందో తెలుసుకోవటం కష్టం. మీ అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకుంటున్నానని అపార్థం చేసుకోకండి. ఇంతకీ మీ మామగారంటే మీ కిష్టమేనా?'

'ఇష్టమయితే మాత్రం ఆ మాట పైకి అంటే బాగుంటుందా?'

సుజాత నవ్వుతూ, 'ఇష్టం అని రాసేసుకుంటున్నాను' అంది.

'మీ అత్తగారంటే మీ కిష్టమేనా?'

'చాలా ఇష్టం. మా అమ్మకంటె ఎక్కువ ఇష్టపడతాను.'

'మీరు చాలా అదృష్టవంతులు' అంది సుజాత.

ఒప్పుకున్నాను.

'మీకు ఆడబిడ్డలూ, మరుదులూ, బావగార్లూ ఉన్నారా? ఆడబిడ్డలెవరైనా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారా?'

'ఇద్దరు ఆడబిడ్డలు పెళ్ళయినాక ఉద్యోగాలు మొదలుపెట్టారు. ఒక ఆడబడుచు పెళ్ళికి ముందు మూడు సంవత్సరాలు ఉద్యోగం చేసి తరవాత కుదరక మానేసింది. మా పెద్ద మరిది భార్యకూడా ఉద్యోగం చేస్తోంది. రెండవ మరిదికి ఇంకా పెళ్ళికాలేదు.' సుజాత హఠాత్తుగా తల వంచుకుంది. నా మనస్సులో మెరుపులా ఒక ఆలోచన తట్టింది. మళ్ళీ సుజాత అందుకుంది.

'మీకు పిల్లలు లేనందువల్ల మీ జీవితం సుఖప్రదం అయిందా లేక...'

'మా పెళ్ళినాటికి మా ఆడబడుచులూ, మరుదులూ చిన్నవాళ్ళు. అందుచేత మాకు ఇంట్లో పిల్లల్లేరన్న భావం ఎప్పుడూ కలగలేదు. ఆనందం, సుఖం అనేది మానసికం. ఏమీ లేకపోయినా జీవితాన్ని ఆనందంగా గడుపుతారు కొందరు. అన్ని సుఖాలూ ఉండి కొంతమంది అసంతృప్తితో బాధపడతారు. అందుచేత పిల్లలు ఉన్నారా, లేదా అన్నది ముఖ్యప్రశ్న కాదు.'

'ఇంతకీ నేనేమని రాసుకోను? సుఖప్రదం అయిందనా, లేదనా?' తికమకపడుతూ అడిగింది సుజాత.

'నన్ను చూస్తే ఎలా అనిపిస్తోంది మీకు?'

'మీరు సుఖంగానే ఉన్నట్లున్నారు.'

'నిజంగానా! అలాగే రాసుకోండి' అన్నాను నవ్వుతూ.

'తీరిక సమయాల్లో మీరిద్దరూ ఇంట్లో ఉండాలని కోరుకుంటారా, లేక బయటికి వెళ్ళాలని కోరుకుంటారా, లేక రెండూనా? లేకపోతే, మీవారు ఒక విధంగానూ, మీరొక విధంగానూ అనుకుంటారా?'

'ఇది చాలా చిక్కు ప్రశ్న అమ్మాయ్!' అన్నాను. సుజాత నవ్వింది. పూర్తిగా వికసించిన కలువపువ్వు నా మనస్సులో మెదిలింది.

'చిక్కు విడదీసి చెప్పండి' అంది.

'ఈ ఒక్క విషయంలోనే మా ఇద్దరికి చీటికీ మాటికీ వాగ్వివాదం జరుగుతూ ఉంటుంది. మా వారికి విండో షాపింగంటే ఇష్టం. నాకు షాపింగంటే సరదా. ఏదన్నా అవసరమై కొనాలనుకున్నప్పుడు తప్ప అనవసరంగా బజార్లో నడిచి నా కాళ్ళకీ కళ్ళకీ శ్రమ కలిగించుకోవటం నాకు

నచ్చదు. నాకు సెలవుపూట ఏ సినిమాకో నాటకానికో వెళ్ళాలని ఉంటుంది. ఆయనకి కడుపునిండా భోజనం చేసి ఏదో చదువుకుంటూ పడు కోవటం, ఆ తరవాత అలా రోడ్లమ్మట తిరగటం ఇష్టం. ఇద్దరం కలిసి ఒకవేళ ఎవరన్నా స్నేహితులింటికి వెళ్ళాలనుకుని సమాధానానికి వచ్చినా ఎవరింటికి వెళ్ళాలన్న విషయం మీద తర్జన భర్జన జరిగి, చివరికి ఎక్కడికీ వెళ్ళకుండా ఆయనొక పుస్తకం, నేనొక పుస్తకం తీసుకుని కాలక్షేపం చేస్తాం.'

'మీ ఇద్దరికీ కలిసి ఇతర వ్యాపకాలేమైనా ఉన్నాయా?'

'కలిసేవేమీ లేవు ఒక్క సాహిత్యరచన తప్ప. కాని, నేను కథలు రాస్తాను, ఆయన కవిత్వం రాస్తారు.'

'మీవారితో మీరు అన్ని కష్టసుఖాలూ చెప్పుకుంటారా?'

'చెప్పుకుంటాను. కానీ, వింటూ వింటూ మధ్యలో కస్సుమంటూ లేస్తారు-'అలా ఎందుకు చేశావు?' 'ఇలా ఎందుకు మాట్లాడావు?' అంటూ. ఒక్కొక్కప్పుడు మనస్సులో మథనపడి మథనపడి ఆ సమస్యా పరి ష్కారం అయిపోయిన తరవాత మరేదైనా సందర్భంలో నేను పడిన బాధంతా వెళ్ళబోస్తూంటాను. ఆయనతో ఎప్పటికప్పుడు చర్చిస్తూనే ఉంటాను-ఇంటి విషయాలూ, ఆఫీసు విషయాలు కూడా.'

'అంతరంగిక విషయాలు ఎంతవరకు మాట్లాడతారు?'

'ఆయన మనస్సుకి కష్టం కలిగించనంత వరకూ, మా సంసారంలో ఎటువంటి కలతలూ ఏర్పడనంతవరకూ.'

'మీవారు మీతో తన కష్టసుఖాలన్నీ చెప్పుకుంటారా?'

'ఇంటి విషయాల్లో— అంటే బంధువుల విషయాల్లాంటివి అన్నీ మనస్సు విప్పి మాట్లాడతారు. తమ ఆఫీసు విషయాలు మాత్రం అన్నీ చర్చించరు.'

'మీవారు మీ మీద చూపే ప్రేమతో మీరు సంతృప్తి పడుతున్నారా?'

'తృప్తిపడటం ఏమిటి-మొహం మొత్తుతూంటే! ఆయనదివెర్రిప్రేమ. నా గురించి ఆలోచించకుండా క్షణం ఉండలేరు. చివరికి నేను ఒక్కర్తెనీ ఎక్కడికైనా వెళ్ళాలన్నా గిలగిల్లాడిపోతారు నేనేమైపోతానోనని! ఇంత వయస్సు వచ్చింది నాకు, ఉద్యోగం చేస్తున్నాను, ఆ మాత్రం నేను నిర్వహించుకు రాలేనా-అంటే వినిపించుకోరు చివరికి చిరాకేసి ఎప్పుడైనా-అబ్బ! నా మానాన నన్ను వదిలెయ్యకూడదూ అని విసుక్కుంటే, నిన్నెలా వదిలేస్తాను- అంటూ నవ్వుతారు.'

'ఏమిటి అంతగా ఆలోచిస్తున్నారు? నా ప్రశ్నకి మీ జవాబు...."

'తృప్తి పడుతూనే ఉన్నాను.'

'మీవారు మీరు చూపే ప్రేమతో తృప్తిపడుతున్నారా?'

'అది ఆయన్ని అడగవలసిన ప్రశ్న'

'కాని, మీరేమనుకుంటున్నా రన్నదే నాకు కావలసింది.'

ఈ అమ్మాయి చంపుకు తింటూంది. నా మనస్సులో ఉన్నవన్నీ చెబితే ఏం బాగుంటుంది— పరాయిపిల్ల ముందర—ఎంత పరిశోధనకైతే మాత్రం!

'అవుననుకుంటాను' అన్నాను పైకి.

'మీవారికీ మీకూ అభిప్రాయభేదాలు కలుగుతుంటాయా?'

'మీరు రోజూ భోజనం చేస్తారా అన్నట్లుగా ఉంది మీ ప్రశ్న!'

నా కామెంటుకి సుజాత పకపకా నవ్వింది. కాగితం మీద ఏదో వ్రాసుకుని 'నేను కొన్ని వివరా లడుగుతాను, దయచేసి చెప్పండి' అంది. ఇప్పటిదాకా అడిగినవి వివరాలుకావా తల్లీ! ఊc, అడుగు, రోటిలో తలదూర్చి రోకటి పోటుకి వెరపేలా?— అని లోలోపల గొణుక్కుని, పైకి— 'అడగండి, దానికేముంది!' అన్నాను. ఈ పిల్లమీద ఓ కథ వ్రాయవచ్చు ననుకుంటూ.

'ఇంటి ఆదాయం ఖర్చుపెట్టడం విషయంలో మీకు అభిప్రాయ భేదాలు వస్తూంటాయా?'

'ఆc, వస్తూనే ఉంటాయి. ఉదాహరణకు—నేను కొత్త కర్టెన్స్ కొందామంటాను. ఆయన పాత నాణాలను కొందామంటారు. ఆయనకి చారిత్రిక నాణాలను పోగుచెయ్యటం సరదా లెండి ఎందుకు మళ్లీ కర్టెన్స్? డబ్బు దండుగ! ఉన్నవి బాగానే ఉన్నాయిలే—అంటారు.'

'సరదాల విషయంలో?'

'అయ్యోరామ! ఆయనకి ఒక్క సరదా లేదండీ. సినిమా సరదా లేదు. పిక్‌నిక్ సరదా లేదు. షాపింగ్ సరదా లేదు. పార్టీల సరదా లేదు. పేకాట సరదా లేదు...'

'పూజా పునస్కారాల విషయంలో...'

'ఆయనకి పూజలూ పేరంటాలూ అంటే కిట్టవు. పెళ్లయిన కొత్తలో శ్రావణమాసం నోము నోచుకోవాలని ఎంత సరదా పడ్డానో! ఛీ, చదువు కున్న దానివి, ఆ నోములేమిటి—అని కసిరిపారేశారు. సంక్రాంతికి

బొమ్మలు పెట్టడం నాకు సరదా. చిన్నప్పుడు చదువు పాడవుతుందని మా నాన్నగారు బొమ్మలు పెట్టనిచ్చేవారు కాదు. పెళ్లయాక మా వారు 'ఇంకా చిన్నపిల్ల లాగా బొమ్మలు పెట్టుకోవట మేమిటి! ఛీ ఛీ' అంటూ చీదరించుకున్నారు. వరలక్ష్మీ వ్రతం చేసుకుంటానండీ అంటే—సిల్లీగా కొబ్బరికాయకి ముక్కూ, చెవులూ పెట్టడం ఏమిటి—ఇప్పుడా ఆడవాళ్ళందర్నీ ఇంట్లో పోగుచేస్తే నే భరించలేను అని ఆముదం తాగిన మొహం పెడతారు. ఇలాంటివాళ్ళతో ఇక పూజలేం సాగుతాయి చెప్పండి.'

సుజాత ఎందువల్లనో ముళ్ళమీద కూర్చున్నట్లు ఇబ్బందిగా కదిలింది కుర్చీలో.

'మిమ్మల్ని నా సంసారం గొడవలతో 'బోర్' చేస్తున్నానా?' అని అడిగాను.

'అబ్బే, చెప్పమని అడిగింది నేనే కదా' అంది మొహమాటపడుతున్నట్లు.

'స్నేహితుల విషయంలో కూడా మీకేమన్నా అభిప్రాయ భేదాలు వస్తాయా?'

'ఆఁ.'

'మరీ ముక్తసరిగా జవాబు చెప్పారు. నేను బోరవుతున్నానని అనుమానిస్తున్నారా?' అని రెట్టించింది. ఈ పిల్ల ఆవులిస్తే పేగ లెక్కెట్టేట్టుంది! గడుసుదే! 'అబ్బే, తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుందనీ...' అంటూ నసిగాను.

'ఫరవాలేదు, చెప్పండి.'

'ఆయన ఆఫీసులో కొలీగ్స్‌నీ, స్నేహితుల్నీ ఇంటికి తీసుకొచ్చినా, ఎక్కడన్నా కలిసినా నేనెంతో కలిసి మెలిసి మాట్లాడతానా, నా కొలీగ్స్, నా స్నేహితులంటే ఆయన ఆమడ దూరంలో ఉంటారు.'

'ఎందుచేత నంటారు?'

'ఫలానా ఆవిడ భర్త అనిపించుకోవటం నామర్దాగా ఉంటుందేమో?'

'మీరు బాధపడుతూ ఉంటారా ఈ విషయంలో?'

'పడను మరీ!'

'అయితే, భార్యాభర్తల హోదా విషయంలో కూడా మీకు అభిప్రాయభేదా లున్నాయా?'

'భార్య భర్తకి సమానం అవుతుందా ఎన్నటికైనా! 'ఎంతనేర్చినా ఎంత జూచినా, ఎంతవార లైనా' 'కాంతలు దాసులేనమ్మా' అన్నాను.

'అంటే ఈ విషయంలో మీరు మీవారితో ఏకీభవిస్తున్నారా?' నమ్మలేనట్లుగా అడిగింది సుజాత.

'ఎలా ఏకీభవిస్తాను! ఇద్దరం సమానం అంటాన్నేను వయస్సులో నేను పెద్ద, నువ్వు చిన్న—నాది మేధావి బుర్ర, నీది కప్పతలకాయ—ఇద్దరం ఒకటెలా అవుతాం! అంటారాయన.'

సుజాత నవ్వాపుకుంది. 'భార్యాభర్తల విధినిర్వహణలో—అంటే ఎవరు ఏయే పనులు చెయ్యాలన్న విషయంలో మీరిద్దరూ ఏకీభవిస్తారా?'

'ఊఁహూఁ' అన్నాను బుర్ర అడ్డంగా ఊపి.

'అంటే, ఇంటిపనుల్లో సహాయం చెయ్యటం మీ వారికి నచ్చదా?'

'అది కాదు. ఇంటిపనుల్లో ఆయన చేసినంత సహాయం ఇంకెవ్వరూ చెయ్యరేమో? అయితే, ఆయన చేసే పద్ధతే నాకు నచ్చదు. వంటలో సాయంచేస్తానంటూ వచ్చి వంటింట్లో ఇన్ని సిగరెట్టు పీకలూ, అగ్గిపుల్లలూ ఎక్కడపడితే అక్కడ పడేసిపోతారు. కూరలకి చెక్కుతీస్తానంటూ వచ్చి ఇల్లంతా పచార్లుచేస్తూ తొక్కలన్నీ ఇంటినిండా పోస్తారు. మీ సహాయానికీ మీకూ ఒక నమస్కారం, వెళ్ళి మీ పని మీరు చూసుకోండి అనవలసివస్తుంది.'

'అత్తవారితో మెలిగే పద్ధతి మీద మీకు అభిప్రాయ భేదాలున్నాయా?'

'ఎవరి అత్తవారు?'

'అఫ్‌కోర్స్, మీ అత్తవారే!'

'నా అత్తవారి విషయంలో నాకూ ఆయనకీ ఎప్పుడూ మనః స్పర్ధలు రాలేదు ఆయన అత్తవారి విషయంలోనే తరుచు వస్తూంటాయి.'

'అదెలా?'

'ఏముంది? పెళ్ళికాగానే పుట్టింటివాళ్ళని మరిచిపోవాలంటారు ఆయన. సూటిగా అనరనుకోండి. అలివైపువాళ్ళని ఆమడ దూరంలో ఉంచాలంటారు. అందుకే నాకనిపిస్తుంది—మనుయుగం నుంచి నేటిదాకా మగవాడు మారలేదని.'

సుజాత వచ్చే ఆవులింతని ఆపుకుని కాగితం మీద ఏదో వ్రాసుకుంది. ఆ తరవాత అడిగింది- 'ప్రేమ వ్యక్తం చెయ్యటం విషయంలో మీకిద్దరికీ అభిప్రాయభేదాలున్నాయా?' అని.

'లేకపోవడమేం, ఖర్మ! నేను చేసిన వంటని మెచ్చుకోకపోతే ఆయనకి నా మీద ప్రేమ లేదనిపిస్తుంది. ఆయన తెచ్చిన చీరని నేను మెచ్చుకోకపోతే తనమీద నాకు ప్రేమ లేదనుకుంటారాయన.'

'శారీరిక సౌఖ్యం పొందటంలో మాటేమిటి?'

'ఓహో! ఆ ప్రేమ మాటా మీరడిగేది?'

సుజాత సిగ్గుపడుతూ తలవంచుకుంది.

'నిజం చెప్పమన్నారా?' అన్నాను.

సుజాత బుగ్గలు ఎరుపెక్కిపోయాయి.

'ఏమే' అంటూ లోపలినుంచి ఓ చిన్న పొలికేక వినిపించింది. కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేచి, 'ఇప్పుడే వస్తాను, ఉండండి' అంటూ లోపలికెళ్ళాను.

'ఏం, బుజ్జీ! మెలుకువొచ్చిందా?' అన్నాను వేళాకోళంగా.

'మెలుకువ రావటానికి నిద్రపట్టిచస్తే కదా! వారానికి వచ్చేది ఒక్క ఆదివారం. మధ్యాహ్నం పూట హాయిగా పడుకోవటానికి కూడా దిక్కులేదు. మీరిద్దరూ ఏమిటాకబుర్లు—కిచకిచమంటూ పిచికల్లా!' అని బద్ధకంగా విసుక్కున్నారాయన.

'మీరొచ్చి అక్కడ కూర్చుని ఆ అమ్మాయితో మాట్లాడుతూ ఉండండి. త్వరగా కాఫీ టిఫినూ చేసి పట్టుకొస్తాను' అన్నాను.

'వద్దులే! ఆ వ్యవహారమేదో త్వరగా ముగించి ఆ పిల్లని సాగనంపి రా. ఇద్దరం హాయిగా పకోడీలు చేసుకుని తిందాం. మళ్ళీ పానకంలో పుడకలా ఆ పిల్లకూడా ఎందుకు?'

'ఆ అమ్మాయి బాగుందండీ. మన శ్రీనివాసుకి మాట్లాడదా మేమిటి?' అన్నాను ఆయన్ని ఎలాగైనా రంగంలోకి దింపుదామని.

'నీకు మతి పోయింది, లేడికి లేచిందే ప్రయాణం అన్నట్లు!' అంటూ నా మాట వినిపించుకోకుండా ఏదో పత్రిక తీసుకుని మళ్ళీ మంచం మీద వాలారు. లాభంలేదని నేను వరండాలోకి వెళ్లాను.

'ఏమండీ, మీ వారు మిమ్మల్ని 'ఏమే' అని పిలుస్తారా' అని అడిగింది సుజాత ఆశ్చర్యంగా.

అవునన్నాను.

'మీరు చదువుకున్నవారూ, ఉద్యోగ్యం చేస్తున్నవారూ—ఏమే అని పిలిస్తే ఎలా ఊరుకుంటున్నారండీ?'

'పెళ్ళికాక ముందు నేను కూడా మీకు మల్లే స్త్రీల హక్కుల గురించి తీవ్రంగా ఆలోచించేదాన్ని. నన్ను పెళ్ళి చేసుకున్నతను 'ఏమే' అంటే, నేను అతన్ని 'ఒరే' అంటానని బింకంగా చెబుతూండేదాన్ని. తీరా పెళ్లయిన మరునాడు నన్నాయన 'ఏమే' అని సంబోధించినప్పుడు నిర్ఘాంతపోవటం మినహా ఏమీ చెయ్యలేకపోయాను. పైగా, ఎన్నోయుగాల నుంచీ నన్నాయన అదే విధంగా పిలుస్తున్నట్లు, ఏదో ఆప్యాయత ధ్వనించినట్లూ అనుభూతి కలిగింది. కాకపోయినా, 'ఏమోయ్' అని మగ వాణ్ణి పిలిచినట్లు కాకుండా 'ఏమే' అని పిలవటమే నయం'.

'పేరు పెట్టి పిలవటం ఫాషన్ కదాండి' అంది సుజాత.

'ఎవరో పరాయివాళ్లు పిలిచినట్లు పేరు పెట్టి పిలవటమేమిటి అంటా రాయన.'

'అలా అయితే ఏదన్నా ముద్దుపేరు పెట్టి పిలవచ్చుకదా' అని వాదించింది ఆ అమ్మాయి.

'ముద్దుగా పిలవటం ముఖ్యంగాని, పేరులో ఏముంది, సుజాతా' అన్నాను.

ఆ అమ్మాయి మరేం మాట్లాడలేదు.

'ఇంతకీ మీరడిగిన ప్రశ్నకి నేనింకా సమాధానం చెప్పలేదు కదూ' అన్నాను నేనే.

'అవునవును' అంటూ తనడిగిన ప్రశ్న కోసం కాగితం పట్టుకుని చూసింది. 'ఈ విషయంలో మీకేమీ అభిప్రాయభేదాలు లేవనుకుంటాను' అంది.

నేను విపులంగా ఎక్కడ చెబుతానోనని సిగ్గుతో ముడుచుకు పోతున్నట్లుగా కనిపించింది. నా సొద అంతా వినిపించి ఆమెను ఇబ్బంది పెట్టడం ఎందుకనిపించింది. పైగా ఆ అమ్మాయి ముక్తసరిగా జవాబు వ్రాసుకోవాలనుకుంటూంటే మధ్య నేనెందుకు పొడిగించాలని 'ఊఁ' అని ఊరుకున్నాను.

'మీ కిద్దరికీ దెబ్బలాట వచ్చినప్పుడు ఇద్దరూ కొంత తగ్గి సమాధానానికి వస్తారా, లేక మీరొక్కరే తగ్గుతారా, లేక మీవారు తగ్గుతారా? లేకుంటే మీరిద్దరూ మొండిగా ఎవరి పంతం వాళ్ళు నెగ్గాలని ఎడమొహం పెడమొహం పెట్టుకుంటారా?'

'అన్నీ సంభవమే. తగువు సందర్భాన్ని బట్టి ఉంటుంది.'

'ఎక్కువగా ఏం జరుగుతుంది?'

'ఆడది తగ్గక ఏం చేస్తుంది!' అన్నాను.

'మీ వారి గురించి మీ అభిప్రాయం ఏమిటి?.... ఇదుగో, ఇక్కడ కొన్ని లక్షణాలు లిస్టుచేసి ఉన్నాయి. మీవారి లక్షణాలు ఇందులో ఉంటే 'టిక్' మార్కు చెయ్యండి' అంటూ తన ఒళ్ళో ఉన్న కాగితాన్ని నా చేతి కిచ్చింది.

లిస్టు చూడటం మొదలు పెట్టాను.

అ) వాదించే రకం.

టిక్కు, నేను మాత్రం తక్కువా!

ఆ) సంకుచిత మనస్తత్వం.

టిక్కు, ఆయనకి నచ్చిన వంకాయకూర వండితేనే తింటారు. ఎప్పుడైనా నాకు నచ్చిన కాలీఫ్లవర్ కూర వండితే మొహమా టానికి కూడా ముట్టుకోరు.

ఇ) ఎప్పుడూ ఏదో ఒక లోపం చూపించే రకం.

టిక్కు, భోజనాల బల్లదగ్గర సుప్రీంకోర్టు జడ్జిలాగ కూర్చుం టారు. అన్నీ తిని, 'నీకు వంటరాదు' అని తీర్పు చెబుతారు.

ఈ) ముక్కుమీద కోపం.

టిక్కు, ముక్కు వేలెడైనా కోపం మూరెడు. మళ్ళీ అట్టేసేపు నిలవదు తాటాకు మంటలా.

ఉ) పిల్లల్ని పాడు చేస్తారు.

దేవుడి దయవల్ల ఆ అవకాశం చేతికి చిక్కలేదు.

ఊ) అతి గుంభనం.

అంత గడుసుతనం లేదు.

ఎ) అసూయాపరులు.

టిక్కు. నాన్నగారిచ్చిన చీర బాగుందని కట్టుకుంటే మొహం ముడుచుకుంటారు. తను కొన్నవి తప్ప వేటినీ నేను మెచ్చుకో కూడదు.

ఏ) తెగ వాగుతారు.

స్నేహితులతో. నాతో మాట్లాడటానికి ఏమీ ఉండదు.

ఐ) నన్ను మోసం చేస్తారు పరస్త్రీల కోసం.

'మగవారి నిలా నమ్మరాదే చెలీ....రాదే చెలీ....'

ఒ) బద్ధకస్థులు.

టిక్కు. క్షవరం చేయించుకోవటానికి సెలూన్‌కి వెళ్ళటం బద్ధకం.

ఓ) నాకు వంకలు పెడతారు.

టిక్కు. అందులో ఫస్టు.

ఔ) నిజాయితీ లేనివారు.

టిక్కు. ఈ సెలవుల్లో కాశ్మీర్ వెడదాం అని రాత్రిపూట చెప్పి, పొద్దున్నే లేచి నేనెప్పుడన్నానని దబాయిస్తారు.

అం) స్వార్థపరులు.

టిక్కు. పొద్దున్నే న్యూస్‌పేపరు పట్టుకెళ్ళి పాకీదొడ్లో గంటల తరబడి కూర్చుంటారు.

క) సిగరెట్లు కాలుస్తారు.

టిక్కు. లేకపోతే వచ్చే జన్మలో దున్నపోతై పుడతారని భయమట

ఖ) చాలా ముభావంగా ఉంటారు.

నామీద కోపం వచ్చినప్పుడు-కాస్సేపు మాత్రం.

గ) అనుమానం మనిషి.

టిక్కు. ఇందాక ఈ అమ్మాయి ఇంటర్‌వ్యూ చెయ్యటాని కొచ్చిందని చెబితే ఎన్ని అనుమానాలు వెళ్ళబోశారు!

ఘ) ఏదీ పట్టించుకోరు.

టిక్కు. కొళాయి కారిపోతున్నా సరే.

చ) దేనికీ బాధ్యత తీసుకోరు.

టిక్కు. ఇద్దరం బజారునుంచి వస్తూంటే కూరలసంచీ పట్టుకోరు.

ఛ) పరస్త్రీలపైన మోజు చూపిస్తారు.

పొరుగింటి పుల్లకూర రుచి.

జ) పిల్లల మీద శ్రద్ధ తీసుకోరు.

అబ్బో, నన్ను కూడా అశ్రద్ధ చేసేవారు ఉంటే కనక.

ఝ) ఉద్యోగం తప్ప మరో ధ్యాస లేదు.

అని నన్నంటారాయన.

ట) మాటంటే పడరు.

టిక్కు. ఉన్నమాటంటే ఉలుకెక్కువ.

ర) కంగారు. ఓరిమి లేదు.

టిక్కు. ఆఫీసు నుంచి నేను రావటం అరగంట ఆలస్యమయితే చాలు, కంగారు! వీధి తలుపు తియ్యటం అరక్షణం ఆలస్యం అయితే చాలు అరుసార్లు బెల్లునొక్కుతారు.

ఢ) శుభ్రత, ఒబ్బిడి లేవు.

టిక్కు. పుస్తకాలూ, కాగితాలూ ఎక్కడివక్కడ పడేస్తారు చదివి. సర్దకూడదట. సర్దితే సమయానికి ఒక్కటీ కనిపించదుట. ఇల్లంతా చెత్తకుండీలా ఉందని విసుక్కుంటే ఇంటలెక్చువల్స్ ఇల్లంటే అలాగే ఉండాలంటారు. ఆఫీసుకి వెళ్ళేముందు హడావిడిగా పక్కలు సర్ది, దుప్పట్లూ దిళ్ళూ సరిచేస్తూంటే, ఇప్పుడు వాటి అవసరం ఏమిటి—అలాఉంటే ఏంపోయింది అని విసుక్కుంటారు. ఎవరన్నా చూస్తే ఏం బాగుంటుంది అంటే, అసలు ఎవరికన్నా మన పడక గదిలోకి రావలసిన అవసరం ఏమిటి— అని వితండ వాదన మొదలు పెడతారు.

ఢ) జూదం ఆడతారు.

ఈయనకి సరిగ్గా పేకాట ఆడటమే రాదు.

ణ) ఇల్లూ, వాకిలీ పట్టించుకోరు.

స్నేహితులు కనిపిస్తే చాలు!

త) సాయంకాలం పూట నాతో కలిసి ఎక్కడికైనా వెళ్లటానికి ఇష్టపడరు.

షాపింగంటే విసుక్కుంటారు కాని, వాకింగంటే తయారే!

థ) భోజనానికి ఆలస్యంగా వస్తారు.

ముఖ్యంగా నాకు ఆకలిగా ఉన్న రోజున.

ద) నేను ఉద్యోగం చెయ్యటం ఇష్టంలేదు.
పైకి అనరు.

ధ) పిసినారి.
కాదు. దుబారా మనిషి.

న) మనస్సు విప్పి మాట్లాడరు.
విప్పి మాట్లాడినా ఏం లాభం, చెప్పిన సలహా తీసుకోరు

ప) ఇంటి విషయాలూ, పక్కింటి విషయాలూ మాట్లాడితే విసుక్కుంటారు
టిక్కు. పైగా, 'వంటలెక్చువల్స్'కి ఇంతకన్న కబుర్లేం ఉంటాయంటారు.

ఫ) పైకి రావాలనే పట్టుదల లేదు.
తనకి ఎందుకు లేదూ! నువ్వు చేసే ఉద్యోగం చాల్లే అంటారు నన్నుమాత్రం.

బ) మోటుమనిషి.
టిక్కు. అమెరికా వెళ్ళొచ్చినాసరే మనిషి మారలేదు. మజ్జిగా అన్నం పెద్ద చప్పుడు చేస్తూ జుర్రుతూ తింటారు. అబ్బ, అంత చప్పుడు చేస్తారేమిటి, మెల్లిగా తినలేరూ అని విసుక్కుంటే "నీలా చడీచప్పుడూ కాకుండా తినటం నాకు చేత కాదు" అంటారు!

భ) ఇంటిపనులన్నీ ఎక్కడా లోపం లేకుండా జరగాలంటారు.
అనరు. పైగా, రేడియోమీద దుమ్ము పేరుకున్నా బాధపడరు. నేను సతమత మవాల్సిందే.

మ) నన్ను తమతో సమానంగా చూడరు.

టిక్కు. ఆయనకన్న నేను రెండంగుళాలు పొట్టి. ఎలా చూస్తారు?

'ఏమిటి మీలో మీరే నవ్వుకుంటున్నారు?' అంది సుజాత.

'మీ ప్రశ్నల లిస్టు చూస్తేనూ! కోర్టులో లాయరుకూడా ఇంత క్రాసెగ్జామిన్ చెయ్యడనుకుంటాను' అన్నాను నవ్వుతూ.

'మీవారినుంచి వేరుపడాలని ఎప్పుడైనా తీవ్రంగా ఆలోచించారా?'

'వేరుపడితే ఏ మవుతుందని ఆలోచించిన మాట వాస్తవం. కాని, వేరుపడాలని మాత్రం కాదు.'

'గత సంవత్సరంలో ఎన్నిసార్లు మీవారితో దెబ్బలాడి ఉంటారు?'

'లెక్కపెట్టలేదు. కాని, చాలాసార్లే.'

'మరి మీరు వేరుపడాలని ఎందుకు కోరుకోలేదు? మీకిద్దరికీ అనేక విషయాలలో అభిప్రాయభేదా లున్నాయి కదా, నిత్యం ఎలా సర్దుకోగలుగుతున్నారు?'

'నువ్వుకూడా పెళ్ళిచేసుకుని చూడు సుజాతా! వివాహంలోని విచిత్రబంధం నీకే అర్థ మవుతుంది. స్త్రీ ఉద్యోగిని అయినంత మాత్రాన పరిస్థితి తారుమారైపోదు. దెబ్బలాటలూ అవీ ఉంటూనే ఉంటాయి. అందుకే మొగుడూ పెళ్ళాల దెబ్బలాటలో మూడోవాళ్ళు కలగజేసుకున్నంత తెలివి తక్కువ పని మరొకటి లేదంటాను.'

'మరి అందరు భార్యాభర్తలూ సుఖంగా ఉండగలుగుతున్నారంటారా?'

'సంసారం లోని సుఖాన్ని అనుభవించాలంటే కొంచెం 'సెన్స్ ఆఫ్ హ్యూమర్' అలవరచుకోవాలి.'

'మొత్తంమీద మీవారిపై మీ కెటువంటి భావం ఉంది? ప్రేమా, అసహ్యమా? రెండూనా?'

'ప్రేమ, గౌరవం.'

'మొత్తంమీద మీ వారికి మీపై ఎటువంటి భావం ఉంది?'

'ప్రేమ, అధికారం.'

'పెళ్ళయిన తరవాత మొదటి సంవత్సరంలో చూపించిన ప్రేమకీ, ఇప్పుడు చూపించే ప్రేమకీ ఏమైనా తేడా ఉందా?'

'అప్పుడు మోజుతో కూడిన ప్రేమ, ఇప్పుడు సాంగత్యం వల్ల పెరిగిన అనుబంధంతో కూడిన ప్రేమ.'

'మీరు మళ్ళీ జీవితం మొదలుపెట్టాల్సివస్తే మళ్ళీ ఆయన్నే చేసుకుంటారా, లేక పెళ్ళే చేసుకోకుండా ఉంటారా?'

'ఆయన్నే చేసుకుంటాను. అలా అనటం భారతనారీధర్మం కదా!

'మీవారు ఏమనుకుంటారు?'

'పెళ్ళే చేసుకోనంటారు.' ఆయనకేం. మగరాయుడు!

సుజాత పెన్ను మూసి కాగితాలు ఫైలులో సర్దుకుంది.

'చాలా థాంక్సండీ. మీరు నా ప్రశ్నలన్నిటికీ ఓపికగా సమాధానా లిచ్చి, నా పరిశోధనలో ఎంతో సహకరించారు'—అంది నమ్రతగా నమస్కరిస్తూ.

'దానికేముందిలే అమ్మా, ఎన్నో విషయాలు మనస్సులో అట్టడుగున దాగినవి, ఎప్పుడూ అనుకోనివీ బయటి కొచ్చాయి. అసలు నువ్వడిగిన ప్రశ్నలు ప్రతివాళ్ళూ ఎవళ్ళకి వాళ్ళు వేసుకోవాలి. అటువంటి ఆత్మ పరిశీలన చాలా అవసరం. నీకు నేనే కృతజ్ఞత తెలపాలి. అదీకాక, నీతో మాట్లాడుతున్నంత సేపూ మరొక ఆలోచన నా మనస్సులో మెది లింది.'

'ఏమిటండీ అది?' అని కుతూహలంతో అడిగింది సుజాత.

'తరవాత నీకే తెలుస్తుందిలే' అన్నాను నవ్వుతూ.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-2-75)